హాస్యకథ

# పిచ్చి గీతలు

**అసలు కథలు ఎట్టారాయాలీ అన్న విషయంమీద ఏకబిగిన గంటరన్న ఉపన్యాసం దంచేశాడు ధవరావు. ఎదురుగా అదంతా వింటూ కూర్చున్నది అతని అభిమాని మాలిని. వాళ్ళిద్దరూ కూర్చున్నది ఒక నక్షత్రాల హోటల్ గదిలో. ఆ గది ఏడో అంతస్తులో ఉన్నది.**

ఉపన్యాసం సాగుతుండగా, ఫోన్ మ్రోగింది. ధనరావు ఫోనెత్తి 'యస్' అన్నాడు.

'సార్! మీ కోసం-ఒకరొచ్చారు. పైకి పంపించమంటారా'

"పేరు కనుక్కో"

"ఎవరో నరకరావు అంటున్నారు సార్!" గూండాలా కనిపిస్తున్నాడు.

"అయితే ఇప్పుడొద్దు నేను చాలా బిజీగా ఉన్నానని చెప్పు.

"అట్లాగే సార్"

"ఇదిగో మాట! నేను బిజీగా ఉన్నా అతనొచ్చి నన్ను చూస్తానంటాడు. చాలా అర్జంట్ అని కూడా చెప్తాడు. అయినా సరే అతన్ని నా రూంకి రానివ్వకు. అవసరమైతే బలవంతంగా ఆపెయ్యి, నీకు తగిన ఫీజు తర్వాత ఇచ్చుకుంటాను." మెల్లగా అని ఫోన్ పెట్టేశాడు. మాలిని వేపు తిరిగి "మనం తర్వాత కలుద్దాం. రేపు ఏయే కథలు రాయకూడదో చెప్తాను, ఏం?" అంటూ ఆమెను రెక్కపుచ్చుకులేపి గబగబా తలుపుతీసి బయటకు నెట్టేశాడు.

"అయ్యో! అయ్యో! అదేంటిసార్! మీ అభిమానిని, చాలా అభిమానంగా చూసుకుంటారనుకున్నాను" కాస్త ఏడుపు మొహం పెట్టింది మాలిని. అటుగా ఎవరో వస్తొంటే, 'ధడా'ల్ను తలుపు వేసి జేబులో పర్సు ఉందో లేదో చూసుకున్నాడు. తలుపు తాళం వేసేసి గబగబా కిటికీ దగ్గరకు వచ్చారు. అది అద్దాల కిటికీ. దిండు అడ్డం పెట్టుకుని అద్దాల కిటికీ మీద ఒక్క గుద్దు గుద్దాడు. గబగబా కిటికీలోంచి దూరి బయటకు వేలాడి, ప్రక్కనే ఉన్న మురికి నీటి గొట్టం పట్టుకుని లిఫ్ట్‌లోంచి క్రిందకి దిగినట్టు, జరజరా కిందకి జారాడు ధనరావు. అక్కడ్నించి గబగబా రోడ్డు మీదకు పరుగెట్టాడు.

"ఏయ్ ఆటో!" అని అరిచాడు.

"రాదు సాబ్!" అంటూ వెళ్ళిపోబోయాడు ఆటోవాడు.

"ఆగాగు! నువ్వెక్కడికి తీసుకెళితే అక్కడికే వస్తా" అంటూ ఆటోవాడ్ని ఆపేశాడు ధనరావు. సరే ఎక్కండి' అన్నాడు ఆటోవాడు. ధనరావు ఎక్కి కూచోగానే ఆటో బయలుదేరింది. అదే సమయంలో 'ధన్'మని ఆటో మీద ఏదో వస్తువు పడ్డ చప్పుడైంది. ధనరావు బయటకు చూశాడు. ఏడో అంతస్తు కిటికీలోంచి తనే ఓ బరువైన పూలకుండీని విసిరేసినట్టు కోపంగా చూశాడు నరకరావు.

'పోనీ త్వరగా! నీకు రెండింతలు ఇస్తాను!' అన్నాడు ధనరావు.

ఆటో మామూలుగా ఇష్టం వచ్చినట్టు వెళ్ళ సాగింది. అట్లా రెండు కి.మీ వెళ్లింది. ఎవరిష్టమైనా ఎంతకాలం సాగుతుంది? అందువల్ల ఆటో ఉన్నట్టుండి పేవ్‌మెంట్ ఎక్కేసి ధనేల్న గోడకు గుద్దుకొని పక్కకి పడిపోయింది. డ్రైవర్ పక్కలు విరిగిపోయాయి. ధనరావు గభాల్న ఆటోలోంచి బయటపడి, మీటర్ రీడింగ్ చూసి పర్సు తీసి డబ్బు లిచ్చి 'పది రూపాయలెక్కువిస్తున్నాను తీసుకో' అంటూ రోడ్డు మీదకు వచ్చి నిలబడ్డాడు. అటూ ఇటూ చూశాడు మరో ఆటోకోసం.

ఇంతలో తనకు తెలిసిన నరకరావు కారు అటు రావటం చూశాడు ధనరావు. ఇక పరుగులంగించుకున్నాడు ఆటో కోసం బస్సులకోసం ఎదురు చూడకుండా. అలా పరుగెడుతూ పరుగెడుతూ చిన్నసందులో దూరాడు. నరకరావుకారు కీచుమని శబ్దంచేస్తూ ఆ చిన్న సందులోకి దూరటానికి ప్రయత్నించింది. అది మరీ పెద్దకారవటంతో ఆ చిన్న సందులోకి దూరలేదు. కారుని వెనక్కీ, ముందుకీ, వెనక్కీ ముందుకీ పోనిచ్చి మెల్లగా సందులోకి పోనిచ్చాడు. ఈ లోగా ధనరావు సందు చివరకు పారిపోయాడు. కారు కూడా జనాన్ని నిర్లక్ష్యంచేస్తూ ధనరావు వెంటబడింది. ముందు ధనరావు పరుగు. వెకన నరకరావు కారు ముందు ధనరావు పరుగు.... వెనక నరకరావు కారు.

ఉన్నట్టుండి ధనరావు ఆగిపోయి, ఓ చిన్న ఇంట్లోకి దూరి మేడమీదకెళ్లాడు ఒగర్చుతూ.

మళ్లీ కారు కీచుమంటూ ఆగిపోయింది. నరకరావుతో పాటు నలుగురు గూండాలు కారు లోంచి దిగారు. వాళ్ళ చేతుల్లో మారణాయుధాలున్నాయి.

వాళ్లని చూసి ఒకాయన నరకరావు దగ్గరకొచ్చి చేతులు జోడించి "బాబ్బాబు నా ఇల్లు పడగొట్టకండి. మున్సిపల్ ప్లాన్ ప్రకారం ఇల్లు కట్టలేదు నిజమే. దానికి పెనాల్టీ కట్టుకుంటాను. అంతే గానీ ఇల్లును పడగొట్టకండి" అన్నాడు.

'వుండవోయ్! మేం మున్సిపాలిటీ వోళ్లంగాం!' అంటూ అతన్ని పక్కకి తోసేసి నలుగురు గూండాలు పైకి వెళ్లారు. నరకరావు బయట నిలబడిపోయాడు ధనరావుకోసం అటూ ఇటూ చూస్తూ. ఇంతలో దడదడ! ధనాధన్! దబదబ శబ్దాలు వినిపించాయి. నరకరావు హడావుడిగా పైకి పరుగెత్తాడు. నలుగురు గూండాలు మేడమీది గది తలుపులు బద్దలు కొట్టారు. వాళ్ల చేతుల్లో ధనరావు చొక్కా ఉంది.

"వాడేడి?" అరిచాడు నరకరావు.

"వాడ్ని పట్టుకోబోతే, చొక్కా దొరికింది సార్!" వాడేమో క్రిందికి దూకేశాడు అన్నారు.

'గాడిదకొడుల్లారా!' పట్టుకోంటి వాడ్ని! అన్నాడు నరకరావు కోపంతో నరకయాతన పడుతూ.

నలుగురు గూండాలు కిందికి చూశారు. ధనరావు కిందరోడ్డుమీద పడిపోయి ఉన్నాడు. నలుగురు గూండాలు సంతోషంగా అరిచి గెంతులేశారు. నరకరావు కూడా కిందికిచూసి వికటంగా నవ్వాడు. 'పదండి వాణ్ణి పట్టుకోండి' అంటూ వాళ్లని ముందుకు తోశాడు.

కొలను వెంకట దుర్గాప్రసాద్

నలుగురూ హుషారుగా కిందికి దిగారు. నరకరావు మీసాలు మెలేసుకుంటూ మెట్లుదిగాడు. ఇంతలో నరకరావు కారు బయ్‌మని శబ్దం చేసుకుంటూ మాయమైంది. నరకరావు కిందికి వచ్చే సరికి నలుగురు గూండాలు ఒకళ్ల మోహాలుఒకళ్ళు చూసుకుంటూ కనిపించారు. రోడ్డుమీద ధనరావు లేడు.

"ఏడ్రావాడు! దొంగనాయాళ్లారా?" విమానం మోతలా అరిచాడు నరకరావు.

"మన కారేసుకుని పారిపోయాడండీ!" ఓ గూండా నిజం చెప్పాడు చాలా ఏళ్ల తర్వాత.

"నేను ఎక్కుతా పద! అన్నాడు నాలుగో గూండా. మూడో గుండా రిక్షా తొక్కుకుంటూ, కారును వెతుక్కుంటూ బయలుదేరాడు.

దొంగనాయాళ్లు నన్నొదిలేసి పోయారు. ఎదవ ప్రిస్టేజీకి పోయినానుగానీ రిక్షా ఎక్కినా బాగుండిపోను. ఇప్పుడు పెద్దరాజకీయ నాయకుడిలా పాదయాత్ర చెయ్యాల్సిన కర్మ పట్టె గదా! అని వాపోయాడు నరకరావు. నడవటం తన ప్రతిష్టకు భగంకరమని అట్లాగే పదినిముషాలు ఉండిపోయాడు అటూ ఇటూ చూస్తూ. అక్కడ తిరిగే జనాన్ని తన చూపులతో భయపెడుతూ.

ముండలకి...... ముండని...

ఆపు అర్థంలేని వాగుడు. అసలీ సంగెజ్జెప్పు. కారుకు సడెన్ బ్రేక్‌వేసి అన్నాడు ధనరావు.

"నేను కిరాయి గూండాని' అన్నాడు నరకరావు. సడెన్ బ్రేక్‌కి తల ఎదుటి అద్దానికి కొట్టుకుపోయిన బాధతో.

"ఏ గాడిదకొడుకు నిన్ను పంపించాడు చెప్పు" అన్నాడు ధనరావు. కారుని మళ్ళీ స్టార్టు చేస్తూ.

"కిడ్నీ బుల్‌డాన్" అన్నాడు నరకరావు.

ఉలిక్కిపడ్డాడు ధనరావు. మళ్లీ కారుకు సడెన్ బ్రేక్ వేశాడు. మళ్ళీ నరకరావు తలపగిలింది.



నరకరావు ఆ గూండా గూబగుయ్యిమనిపించాడు. వెంటనే ఆ గూండా కోపంతో, అటువేపు సైకిల్‌మీద వస్తున్న వాడ్ని ఒక్క గుద్దుగుద్దాడు. ఆ సైకిల్‌వాడు సామాన్య మానవుడవటం చేత నేల మీదపడ్డాడు లేవలేదు. గూండా, ఆ సామాన్యుడ్ని నుండి సైకిల్ని విడదీసి, అదెక్కి కారును వెంబడించటం కోసం బయలుదేరాడు. మరో గూండా, మోపెడ్‌మీద వస్తున్న ఓ ముసలాయన్ను ఆపి ఆయన్ని ఎత్తిపక్కకి విసిరేసి, కారుని వెతుక్కుంటూ బయలుదేరాడు. మూడోగూండా ఓ సైకిల్ రిక్షావాడ్ని తన్ని రిక్ష లాక్కుని 'రండిసార్' అని నరకరావును పిల్చాడు. 'ధూ' నాయాల్ల, నేను రిక్ష ఎక్కేవాడ్ననుకున్నావురా! ఫారెన్ కారు తప్ప మరోటి ఎక్కటం ఎరగనోణ్ణి అని మళ్ళీ అరిచాడు హెలికాప్టర్ మోతలా.

ఇంతలో కారు వచ్చి ఆగింది నరకరావు దగ్గర. నరకరావు ఆశ్చర్యంగా చూశాడు అది తనకారే! ధనరావు నడుపుతున్నాడు!!

ధనరావు కారు తలుపుతీసి రా లోపలికి మాటాడుకుందాం!' అన్నాడు నరకరావు ఎగిరి కారులో కూర్చున్నాడు ధనరావు పక్కనే.

వారంరోజుల్నించి గమనిస్తున్నా ఎవడివిరా నువ్వు అన్నాడు ధనరావు తెచ్చిపెట్టుకున్న గంభీరంతో

నరకరావు స్టీమర్ హారన్‌లా నవ్వాడు. ఒక చెయ్యి ధనరావు మెడమీదవేశాడు, ఏక్షణాన్నయినా గట్టిగా నొక్కేద్దామని అయినా భయం లేనట్టు నటించాడు ధనరావు.

నేను గూండాలకి గూండాని. రాక్షసులకు రాక్షసుడ్ని. వెధవలకు వెధవని. ద్రోహులకి ద్రోహిని

"ఎవరూ? మళ్ళీ చెప్పు!" అన్నాడు ధనరావు.

"కిడ్నీ బుల్‌డాన్!" మూలుగుతూ అన్నాడు నరకరావు.

"ఎందుకు పంపాడు! ఆయన మా గురువుగారు. అంటే ఆయనకు నేను ఏకలవ్య శిష్యుడ్నిలే. ఆయనెందుకు పంపాడు?" మళ్ళీ కారు స్టార్టు చేస్తూ అన్నాడు ధనరావు.

'కారుని పోనీయ్! సడెన్ బ్రేక్ వెయ్యొద్దు' అన్నాడు నరకరావు బాధగా

'అట్లాగే చెప్పు!' అన్నాడు కారు చాలా వేగంగా నడుపుతూ.

కిడ్నీ బుల్‌డాన్ దగ్గర పన్జేసే మానేజరు లండన్నుంచి ఇండియా వచ్చాడు. ఇండియా అంటే ఢిల్లీకదా అక్కడ్నించి ఇక్కడికొచ్చాడు.

వాళ్ళు నీ అడ్రసిచ్చాడు. నిన్ను నరికి పోగులెయ్యమన్నాడు. దానికి రేటు మాట్లాడాడు. ఒప్పుకున్నాను అన్నాడు నరకరావు.

"అదే, ఎందుకూ, ఎందుకూ, అని?" స్టీరింగ్ వదిలేసి జట్టుపీక్కుంటూ అన్నాడు ధనరావు.

నరకరావు ఆ కారు వెళుతున్న తీరు చూసి గావు కేకలుపెట్టాడు. మళ్ళీ సడెన్ బ్రేక్ వేశాడు ధనరావు. ఆ దెబ్బతో నరకరావు తల మరింత రక్తపుముద్ద అయింది. తల పక్కకి వరిగి పోయింది. ధనరావు గబగబా నరకరావు చెయ్యి పట్టుకుని నాడి చూశాడు. కొంచెం ఆడుతున్నట్టు కనిపించింది. వెంటనే నరకరావు భుజాలుపట్టుకుని బలంగా కుదిపాడు.

ఆ మేనేజరుగాడు ఎవడు చెప్పు!! వాడి అడ్రసు చెప్పు!' అన్నాడు ధనరావు.

నరకరావు చెప్పలేకపోయాడు. వాడికి స్పృహ తప్పిందని ధనరావు గ్రహించి, మళ్ళీ కారు స్టార్ట్ చేశాడు. ఒక చేత్తో కారు స్టీరింగ్ తిప్పుతూ, రెండో చేత్తో నరకరావు బనీను జేబు వెతికాడు. మర్డర్ కాంట్రాక్టు కాయితం కనిపించింది. దాన్లో కిడ్నీ బుల్‌డాగ్ మానేజరు అడ్రసు చూశాడు. కారు తిన్నగా తీసుకెళ్ళి ఆ అడ్రసు ప్రాంతంలో ఆపాడు. నరకరావుని లేవనెత్తి వాడి చారల బనీను తీసి తను వేసుకున్నాడు. వాడిలాగ జుట్టుని చిందర వందర చేసుకున్నాడు. బనీను జేబులో మర్డర్ కాంట్రాక్టు కాగితాన్ని జాగ్రత్త వేశాడు. కారు తలుపు తీసి బయటపడ్డాడు.

అదొక పెద్ద ఎస్టేటు. బయట పెద్దగేటు. ఎస్టేటు చుట్టూ ఎత్తయిన గోడ.

ధనరావు అటూ ఇటూ చూశాడు. బలమైన ఇనప గేటును తెరవటం కష్టం అని గ్రహించాడు. గేటు వెనుక ఫర్లాంగుదూరంలో పెద్ద భవనం ఉంది. ఆ భవనంలో మానేజరుగాడుంటాడు. వాడి దగ్గిరికెళితే గానీ అసలు సంగతి తెలీదు అనుకున్నాడు.

రోడ్డుమీద ఒక్క సెకను గొంతు కూర్చుని స్ప్రింగులా పైకి ఎగిరి గోడమీద నుండి అవతలి వైపుకు దూకాడు. మెల్లగా మోకాళ్లమీద నడుస్తూ చూస్తున్నాడు. భవనంలో ఒకటి రెండు చోట్ల తప్ప ఇంకెక్కడా లైట్లు వెలగటం లేదు. (అన్నట్టు అప్పటికి బాగా చీకటి పడింది) ధనరావు మెల్లగా లేచి, బొడ్లోంచి పిస్టల్ తీశాడు (అన్నట్టు ఆ పిస్టలు నరకరావు బొడ్లో ఉంటే, ధనరావు కొట్టేశాడు).

ఆ భవనానికి పదిగజాల దూరంలో ధనరావు చేరేసరికి దున్నపోతులాంటి రెండు కుక్కలు బయటకొచ్చి అరవటం మొదలెట్టాయి. అవి గొలుసుతో కట్టేసి ఉన్నాయి. లేపోతే ధనరావు పని అయిపోయేది. ఆ గొలుసులను పట్టుకుని ఉన్న ఓ తెల్ల మనిషి బయటకొచ్చాడు.

'హేండ్సప్' అని గట్టిగా అరిచారు ధనరావు పిస్టల్ని రెండు చేతుల్లో పట్టుకుని ఆ తెల్ల మనిషికేసి గురిపెట్టి చూస్తూ.

తెల్లమనిషి తెల్లబోయి చేతులు రెండూ పైకెత్తాడు. కుక్క గొలుసుల్ని వదిలేశాడు. వెంటనే కుక్కలు రెండూ ఎగిరి ధనరావుమీద పడ్డాయి. కానీ ధనరావు గభాల్న తప్పించుకుని గోడ దూకినట్టుగానే ఎగిరి ఆ తెల్లమనిషి ముందు వాలాడు. తెల్ల మనిషి చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకుని పిస్టల్ని అతని కణతకి నొక్కి పెట్టాడు. తప్పించుకున్న ధనరావుని చూసికుక్కలు వెనక్కి తిరిగి మళ్లీ మీదకి ఎగరబొయ్యాయి.

"కుక్కల్లారా జాగ్రత్త!' అడుగుముందుకు వేసారో మీ బాస్ తల ఎగిరిపోతుంది' మీ బాస్‌కుక్క చావు చస్తాడు!' కర్కశంగా అన్నాడు ధనరావు. నోనో!కుక్కల్లారా మీరు వెనక్కి వెళ్లండి! అన్నాడు మానేజరు. కుక్కలు రెండూ వెనక్కి తగ్గి తోకలు ముడిచాయి.

'ఇంత విశ్వాసంగల కుక్కల్ని నేనెక్కడా చూళ్లేదు!' సబ్బాష్! అన్నాడు ధనరావు వికటంగా నవ్వుతూ. తర్వాత నవ్వటం ఆపి 'ఇపుడు చెప్పు! నువ్వు మా గురువుగారి మానేజరువేనా! అయినే నన్ను నరికి పోగులెయ్యమని నరకరావుతో ఎందుకు కాంట్రాక్టు కుదుర్చుకున్నావ్? చెప్పు! చెప్పు!! చెప్పు!!! అన్నాడు ధనరావు ట్రిగ్గర్‌ని కొంచెం నొక్కి పట్టి ఉంచి.

వద్దువద్దు నన్ను చంపొద్దు" అని ఏడ్చాడు మానేజరు. అయితేచెప్పు నన్ను ఎందుకు నరికి పోగులెయ్యమన్నావు?" క్రూరంగా అడిగాడు ధనరావు.

"మీరు మీరు ఆయన నవల్ని తెలుగులో కాపీ కొట్టి రాస్తుంటే నేనేమాళ్లేక అట్లా చేద్దామని ఇండియా వచ్చాను" అన్నాడు మానేజరు.

అవును నేను ఆయన నవల్ని కాపీ కొడుతున్నానని ఎవడు చెప్పాడు నీకు?" పిస్టల్ని మానేజరు కణతకేసి నొక్కుతూ అరిచాడు ధనరావు.

"ఎవడో గిట్టనివాడు నీ కాపీ భాగోతం గురించి కిడ్నీకి రాశాడు. కిడ్నీ ఆ ఉత్తరాన్ని నాకిచ్చి 'ఎవిటో చూడు' అన్నాడు. నువు కాపీ కొట్టిన నవలలు కూడా పంపించాడు ఆ ఉత్తరం రాసినవాడు" అన్నాడు మానేజరు.

"అవును కాపీ కొట్టాను! నా ఇష్టం. దానికి నీ పర్మిషన్ గావాల్నా? కిడ్నీ పర్మిషన్ గావాల్నా? నేను ఒకటో తరగతి నుండి కాపీ కొట్టే పాసయ్యాను. దానికి ఎవడి పర్మిషనూ తీసుకోలేదు. మీ బోడి నవల్లు కాపీ కొట్టేందుకు పర్మిషన్ గావాల్నా?" అంటూ ఒక చెయ్యి మానేజరు గడ్డం కిందనుండి పోనిచ్చి గొంతుని నొక్కి పట్టాడు. మానేజరు కొంచెం అదునుచూసి మోచేత్తో ధనరావుపొట్టలో పొడిచాడు. పిస్టలు ఎగిరి దూరంగా పడింది. ధనరావు తేరుకుని మానేజరు మీద పడ్డాడు. మానేజరు కిందపడి పిస్టలు అందుకోవడానికి ప్రయత్నించాడు. ధనరావు మానేజరు ఒకరిమీద ఒకరుపడి దొర్లారు. పెనుగులాడారు.... పెనుగులాడారు.... పెనుగులాడారు.... పిస్టలు చేతికంది. ఢాం అని పేలింది.

** ** **

కెవ్వుమని లేచాడు రచయిత ధనరావు నిద్రలోంచి. అప్పటివరకు అతను భార్యతో పెనుగులాడుతున్నాడు. ఆమె నోట మాటరాక అతన్ని తోసెయ్యలేక అప్పటి వరకు నరకయాతన పడింది. ధనరావుకి పూర్తిగా మెలుకువరాగానే నానా తిట్లూ తిట్టింది. "మీ ఇంగ్లీషు నవల్లూ మీరూ పాడయిపోనూ. మీ కలం వంకరపోనూ....మీ రచనలు దిబ్బలో పడెయ్య......'

(తిట్లు చాలా ఉన్నాయి. కథ మాత్రం అయిపోయింది).

